వాహన్ ఎన్ఐసి ద్వారా రవాణా సేవలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

రవాణాశాఖ పరిధిలో ఇ-ప్రగతి సేవలను బుధవారం నుంచి నిలిచిపోయాయని ఉప రవాణా కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఫిట్‌నెస్ పరీక్షలు, వాహన పర్మిట్లు, పలు కార్యకలాపాలు వాహన్ ఎన్ఐసి ద్వారా ఈనెల 23వ తేదీ నుంచి అందుబాటులోకి వచ్చినటు పేర్కొన్నారు. వాహనదారులు, యజమానులు దీన్ని గమనించి వారి కార్యకలాపాలను వాహన్ ఎన్ఐసి ద్వారా నిర్వహించుకోవాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే వాహన యజమాని సరైన వాహన ధ్రువపత్రాలతో జిల్లా రవాణాశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

బడి తెరిచిన రోజే పుస్తకాలు



శ్రీకాకుళం నగరంలోని గొడౌన్ నుంచి మండలాలకు తరలిస్తున్న పుస్తకాలు

- విద్యార్థులకు అందడంపై నెలకొన్న సందేహాలు
- జిల్లాకు కావాల్సిన పుస్తకాలు 6,26,925
- ఇప్పటివరకు వచ్చినవి 2,85,396
- 15 మండలాలకు ఒక్కపుస్తకమూ చేరని పరిస్థితి

2024-25 నూతన విద్యా సంవత్సరానికి సంబంధించి ఉచిత పాఠ్యపుస్తకాలు ఈ ఏడాది సకాలంలో ఎంత మేర సమకూరుస్తారనే అంశంపై సందిగ్ధత నెలకొంది. పాఠశాలల ప్రారంభానికి ఇంకా ఇరవై రోజులే ఉంది. విద్యార్థులు పాఠశాలలకు వచ్చిన మొదటి రోజునే పాఠ్య పుస్తకాలు, విద్యా కానుక కిట్లను అందజేయాల్సి ఉంది. ఎన్నికల సమయం కావడంతో కొందరు టీచర్లు ఓట్ల లెక్కింపు విధుల్లో ఉంటారు. దీంతో ఈసారి పాఠ్యపుస్తకాల పంపిణీ ఆలసమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. మరోవైపు జిల్లాకు అవసరమైన పుస్తకాల్లో ఇప్పటివరకు మూడో వంతు వచ్చాయి. వచ్చే నెల 12న పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎంత మేరకు విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తారో? అన్నది సందేహంగా కనిపిస్తోంది.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వచ్చే విద్యా సంవత్సరంలో జిల్లాకు కలిపి మొత్తం పుస్తకాలు కావాలి. ఈ మేరకు ప్రభుత్వానికి విద్యాశాఖ అధికారులు ఇండెంట్ పెట్టారు. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు కావాల్సినవి 7,37,662 పుస్తకాలు అవసరం కాగా, పుస్తకాల గొడౌన్‌లో 1,10,737 పుస్తకాలు బఫర్ నిల్వలు ఉన్నాయి. దీంతో జిల్లా విద్యార్థులకు 6,26,925 పుస్తకాలు కావాల్సి ఉంది. జిల్లా అవసరాలతో పాటు అదనంగా మరో పది శాతంపైగా పుస్తకాల కోసం ప్రింటింగ్ ఆర్డర్ పెట్టారు. ఇప్పటివరకు జిల్లాకు 2,85,396 పుస్తకాలు వచ్చాయి. మరో 4,10,588 పుస్తకాలు రావాల్సి ఉంది. జిల్లాకు వచ్చిన పుస్తకాలను ఎప్పటికప్పుడు మండల కేంద్రాలకు పంపిస్తున్నారు. గురువారం నాటికి జిల్లాలోని 15 మండలాలకు 2,52,947 పుస్తకాలను సరఫరా చేశారు. ఎనిమిది నుంచి పదో తరగతి వరకు పుస్తకాల పంపిణీని మూడు ప్రయివేట్ ప్రింటర్లరకు అప్పగించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలకు సంబంధించి పుస్తకాల ప్రింటింగ్, సరఫరా బాధ్యతలను సంబంధిత ప్రయివేట్ సంస్థలే చూస్తున్నాయి. ప్రింట్ చేసిన పుస్తకాల మేరకు వారు నేరుగా మండల కేంద్రాలకు చేరవేస్తున్నారు.

15 మండలాలకు ఒక్క పుస్తకమూ చేరని పరిస్థితి

ఒకటి నుంచి ఏడో తరగతి వరకు సరఫరా చేయాల్సిన పుస్తకాల్లో ఏవీ సక్రమంగా రాలేదు. ఒకటి, రెండు, ఆరో తరగతిలకు సంబంధించిన పుస్తకాలు పూర్తిస్థాయిలో వచ్చినట్లు తెలుస్తోంది. మిగిలిన తరగతుల పుస్తకాలకు సంబంధించి కొన్ని టైటిల్స్ మాత్రమే జిల్లా గొడౌన్‌కు చేరాయి. జిల్లాలో 30 మండలాలు ఉండగా, ఇప్పటివరకు సగం మండలాలకే పుస్తకాలను సరఫరా చేశారు. జిల్లాలోని 15 మండలాలకు ఇప్పటివరకు ఒక్క పుస్తకమూ చేరని పరిస్థితి నెలకొంది.

పదో తరగతికి సిబిఎస్ఇ సిలబస్

ఈ విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి విద్యార్థులకు సిలబస్ మారనుంది. సిబిఎస్ఇ సిలబస్ అమలు చేయనున్నారు. ఇప్పటివరకు స్టేట్ సిలబస్ చదువుకున్న విద్యార్థులకు ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇది కొంత కష్టతరంగా మారే అవకాశం ఉందన్న అభిప్రాయాన్ని పలువురు ఉపాధ్యాయులు వ్యక్తం చేస్తున్నారు.

ప్రయివేట్ విద్యార్థులకు రెండు రకాల సిలబస్‌లు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఒకేరకమైన సిలబస్ అమలవుతుండగా ప్రయివేట్, కార్పొరేట్ యాజమాన్యాలు రెండు రకాల సిలబస్‌ను అమలు చేస్తున్నాయి. ప్రభుత్వ పాఠ్యాంశాలను బోధిస్తూనే మరోవైపు వారు నిర్ణయించిన సిలబస్‌నూ పిల్లలపై రుద్దుతున్నారు. ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లలో రెండు రకాల పరీక్షలను నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. మరోవైపు రెండు రకాల సిలబస్‌కు సంబంధించి పుస్తకాలను కొనుగోలు చేయాల్సి రావడంతో తల్లిదండ్రులపై ఆర్థిక భారమూ పడుతోంది.

ఈ ఏడాదైనా పుస్తకాలు సక్రమంగా ఇచ్చేనా?

నాలుగు సంవత్సరాలుగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడంతో జాప్యం జరుగుతోంది. పాఠశాలలు తెరిచిన రోజే అందిస్తామని చెప్పున్న మాటలు ప్రకటనలకే పరిమితమవుతోంది. పాఠశాలలు తెరిచిన అనంతరం రెండు, మూడు నెలల పాటు పాఠ్యపుస్తకాలు అందని పరిస్థితి గతంలో తలెత్తింది. జిల్లాకు సంబంధించి ఇప్పటివరకు మూడో వంతు పుస్తకాలు మాత్రమే వచ్చాయి. వచ్చే నెల 12వ తేదీన పాఠశాలలు పున:ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ సమయానికి ఎంత మేరకు సరఫరా చేయగలుగుతారనేది వేచి చూడాల్సి ఉంది.

సకాలంలో పంపిణీకి చర్యలు



జిల్లాలో సకాలంలో పుస్తకాల సరఫరాకు చర్యలు చేపడుతున్నాం. ప్రభుత్వానికి పంపిన ఇండెంట్ మేరకు పలు విడతలుగా పుస్తకాలు జిల్లాకు చేరాయి. వాటిని మండల పాయింట్లకు వెంటనే పంపిస్తున్నాం. ఇప్పటివరకు 15 మండలాలకు పుస్తకాలను పంపాం. పాఠశాలల తెరిచే నాటికి విద్యార్థులకు చేతుల్లో పుస్తకాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

- సతీష్, జిల్లా ప్రభుత్వ పాఠ్యపుస్తకాల మేనేజర్



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ఓట్ల లెక్కింపునకు పటిష్ట భద్రత

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పటిష్ట భద్రత నడుమ ఓట్ల లెక్కింపును చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనా ఆదేశించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రత, సిసి టివిల ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలన్నారు. శిక్షణ పూర్తి చేయాలని చెప్పారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఒక్కో నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు వివరాలు, పోస్టల్ బ్యాలెట్ తదితర వివరాలను వివరించారు. మూడంచెల భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయడమైందని, పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల పరిశీలకుల సమక్షంలో కౌంటింగ్ సిబ్బంది రెండో రేండమైజేషన్ ప్రక్రియ చేస్తున్నట్లు వివరించారు. ఓట్ల లెక్కింపు సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయా జిల్లాల్లో ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో చేసుకున్న ఏర్పాట్లపై, ఓట్ల లెక్కింపు సిబ్బందికి శిక్షణపై జిల్లా ఎన్నికల అధికారులు సిఇఒకు వివరించారు. జిల్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, పలాస, శ్రీకాకుళం, పాతపట్నం, ఇచ్ఛాపురం, నరసన్నపేట నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు భరత్ నాయక్, సిహెచ్.రంగయ్య, అప్పారావు, సుదర్శన్ దొర, రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు రగ్బీ జిల్లా జట్టు ఎంపిక



టెక్కలి : ఈ నెల 25న టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా స్థాయి రగ్బీ పోటీల జట్టు ఎంపిక చేస్తామని అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డొంకాన రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి పొన్నాడ పార్వతీశంలు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-18 ఎంపిక చేసిన జట్టులో పాల్గొనే క్రీడాకారులు ఈ నెల 30 నుంచి రెండు రోజుల పాటు విశాఖపట్నం జిల్లా భీమిలి వద్ద జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. జట్టు ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు తమ ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలతో పాల్గొవాలని సూచించారు.



పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక

భద్రతా సిబ్బంది అప్రమత్తం

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సమీపిస్తున్న వేళ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి జి.ఆర్.రాదిక ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం ఈవిఎంలు మండలంలోని శివాని ఇంజినీరింగ్ కళాశాలలో భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద మూడంచెల భద్రతను బుధవారం అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో 24X7 నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ క్రమంలో గార్డు రిజిస్టర్‌లో సంతకం చేశారు. సిబ్బంది నిర్వహిస్తున్న గార్డు భద్రతా సరళిని పర్యవేక్షించారు. అలాగే నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ పత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేశారు. గార్డులను నియమించిన సిబ్బంది వివరాలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిఎన్ కాలనీ రెండో లైన్ బీట్ సిబ్బంది పనితీరును పరిశీలించారు. పకడ్బందీగా గస్తీ విధులు నిర్వహించి నేర నియంత్ర చర్యలు చేపట్టాలని సూచించారు. టౌన్ పరిధిలో విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహించి అనుమానం ఉన్న కొత్త వ్యక్తులపై, పాత నేరస్తులపై నిఘా ఉంచాలని సూచించారు. ఈమె వెంట టూ టౌన్ ఎస్ఐ హరికృష్ణ ఉన్నారు.

స్పాట్ కౌన్సెలింగ్ తేదీల మార్పు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 12 గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో మిగులు సీట్లు భర్తీకి స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ తేదీలు మార్పు చేసినట్లు జిల్లా సమన్వయ అధికారి ఎన్.బాలాజీ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ఈ నెల 25న ప్రకటించామని, అనివార్య కారణాల వల్ల ఎపి సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సెక్రటరీ ఆదేశాల మేరకు 28 నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని అన్నారు. 28న ఐదో తరగతి బాలురుకు దుప్పలవలస డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో, 29న బాలికలకు ఎచ్చెర్ల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో, 30న ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం బాలురుకు దుప్పలవలసలో, 31న ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం బాలికలకు ఎచ్చెర్లలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని అన్నారు. ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థినీ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఐదో తరగతి ప్రవేశానికి 4వ తరగతి చదివిన స్టడీ ధ్రువపత్రం, ఆధార్, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి పదో తరగతి మార్కుల లిస్టు, ఆధార్, కుల ఆదాయ ధ్రువీకరణతో ఉదయం 10 గంటలకు అడ్మిషన్ కౌన్సెలింగ్ హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 9701736862, 7569788629 సెల్ నంబర్లు, 2352024 ఫోన్ నంబరుకు సంప్రదించాలన్నారు.

ఇంటర్‌లో బాలురు ఖాళీల వివరాలు

దుప్పలవలసలో బైపిసి గ్రూపులో ఎస్‌సి 4, బిసి ఒకటి, కొల్లివలస బైపిసి గ్రూప్‌లో బిసి 11, కంచిలి బైపిసి గ్రూప్‌లో బిసి ఒకటి, ఎంపిసి గ్రూప్‌లో ఎస్‌సి ఒకటి, ఎస్‌టి ఒకటి, బిసి ఒకటి ఖాళీలు ఉన్నాయని అన్నారు.

బాలికలు ఖాళీల వివరాలు

తామరపల్లి ఎంపిసి గ్రూప్‌లో ఎస్‌సి 11, ఒసి ఒకటి, బైపిసి గ్రూప్‌లో ఒసి ఒకటి, పాతపట్నం ఎంపిసి గ్రూప్‌లో ఎస్‌టి ఒకటి, ఎంపిసిలో ఎస్‌టి ఒకటి, ఒసి ఒకటి, మందస ఎంపిసిలో ఎస్‌టి 29, బైపిసిలో ఎస్‌సి 12, నందిగాం సిఇసిలో ఎస్‌టి 31, ఎస్‌టి ఒకటి, బిసి రెండు, ఒసి ఒకటి, ఎంఇసి గ్రూప్‌లో ఎస్‌సి 34, ఎస్‌టి మూడు ఖాళీలు ఉన్నాయని అన్నారు.

పక్కాగా కౌంటింగ్

- శిక్షణలో నేర్చుకున్నది ఆచరించాలి
- జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎన్నికల కమిషన్ సూచించిన నియమ నిబంధనలపై రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. లెక్కింపు పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో కౌంటింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్, ఇవిఎంల్లో ఓట్ల లెక్కింపుపై ఒక్కరోజు శిక్షణా తరగతులను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ నాలుగో తేదీన ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఓట్ల లెక్కింపులో ఆర్ఒ, ఎఆర్ఒ, సూపర్‌వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లు సమన్వయంతో పనిచేసి ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. విధులకు హాజరయ్యే సిబ్బంది లెక్కింపునకు సంబంధించిన హ్యాండ్ బుక్ క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్‌లో డిక్లరేషన్‌పై సంతకం ఉన్నదీ, లేనిదీ జాగ్రత్తగా పరిశీలించాలన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ఆర్ఒ, అబ్జర్వర్ల పాత్ర కీలకం

ఓట్ల లెక్కింపులో రిటర్నింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమన్నారు. ఆయా నియోజకవర్గ సంబంధిత రిటర్నింగ్ అధికారిదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేశారు. దాన్ని పక్కాగా చేపట్టాలని సూచించారు. ప్రశాంత కౌంటింగ్ లక్ష్యంగా పనితీరు ఉండాలని, కౌంటింగ్ డేటా క్రోడీకరణ, ఎన్కోర్ యాప్‌లో అప్‌లోడ్ సక్రమంగా సకాలంలో చేయాలన్నారు. అనంతరం శిక్షణకు సంబంధించి పలు ప్రశ్నలు అడిగి, సమాధానాలు రాబట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఆర్ఒలు నూరుల్‌కమర్, భరత్ నాయక్, సిహెచ్.రంగయ్య, లక్ష్మణమూర్తి, రామ్మోహన్, సుదర్శన్‌దొర, అప్పారావు, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ చిట్టిరాజు, ట్రైనర్లు కిరణ్, ఎన్.బాలాజీ, మెప్మా పీడీ కిరణ్ కుమార్, శేషగిరి, తహశీల్దార్లు, పలు స్థాయిల సిబ్బంది శిక్షణకు హాజరయ్యారు.

శిక్షణ ద్వారా డ్రైవింగ్‌లో మెళకువలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో డ్రైవింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 15వ బ్యాచ్ డ్రైవర్లకు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ సర్టిఫికెట్లు అందజేశారు. ఆర్‌టిసి కాంప్లెక్సు ఆవరణలో ఉన్న డ్రైవింగ్ స్కూల్‌లో వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ తీసుకున్న వారు భవిష్యత్‌లో మంచి డ్రైవర్లుగా గుర్తింపు పొందాలన్నారు. డ్రైవింగ్ శిక్షణకు వారంలో 16వ బ్యాచ్ మొదలు కానుందని తెలిపారు. లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్‌తో ఒక సంవత్సరం అనుభవం కలిగిన వారు ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. 40 రోజుల పాటు శిక్షణతో పాటు మెకానికల్ వర్క్, యోగా, వ్యక్తిత్వ వికాసం, ట్రాఫిక్, రోడ్డు ట్రాఫిక్ రూల్స్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.



ధ్రువపత్రాలు అందుకున్న వారితో విజయ్‌కుమార్

మండుతున్న ఎండలు



- జనం ఉక్కిరిబిక్కిరి
- పెరిగిన విద్యుత్ వాడకం
- గిర్రున తిరుగుతున్న మీటర్లు



ప్రజాశక్తి - పలాస

కరెంటు బిల్లులు చూసిన సామాన్యుని గుండె గుభేల్‌మంటోంది. ఇంతకాలం అదనపు బాదుడైన సర్‌ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, ఫిక్స్‌డ్ ఛార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ తదితర పేర్లతో ప్రభుత్వం ఎడాపెడా వసూలు చేసింది. వాటి నుంచి బయటపడక ముందే వినియోగదారుడు తాజాగా ఎండలు, ఉక్కపోత బాదుడు ఎదుర్కొంటున్నాడు. సకాలంలో వర్షాలు పడకపోవడంతో ఎండలు ఎక్కువగా ఉన్నాయి. ప్రశాంత, చల్లటి వాతావరణంగా పేరొందిన సిక్కోలులో ఎన్నడూ లేనంతగా రోజువారీ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్, అంతకుమించి నమోదవుతున్నాయి. మండే ఎండలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పసి పిల్లల నుంచి వృద్ధుల వరకు ఇళ్లల్లో ఉండలేకపోతున్నారు. ఉదయం తొమ్మిది గంటలకే సూర్యుని భగభగలు బయటకు రాకుండా చేస్తున్నాయి. సాయంత్రం ఐదు గంటలైనా ఉక్కపోత తగ్గడం లేదు. ఫలితంగా పట్టణంలోని ప్రధాన రహదారులే కాదు, వీధులన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. ఈ క్రమంలో అటు ఎండ నుంచి ఇటు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాలతో పాటు చల్లటి గాలినిచ్చే విద్యుత్ పరికరాలను ఎక్కువగా వాడుతున్నారు. రాత్రింబవళ్లు ఎండ, వేడి, ఉక్కపోతకు తట్టుకోలేక ఇళ్లలో కూలర్లు, ఫ్యాన్లు, ఎసిల వాడకం ఎక్కువగా ఉంటోంది. ఐదు నిమిషాలు కరెంటు పోయినా భరించలేకపోతున్నారు. ఇలా నిరంతరం కరెంటు వాడకం పెరగడంతో విద్యుత్ మీటరు కూడా గిర్రున తిరుగుతోంది. దీంతో యూనిట్లు పెరిగి శ్లాబ్ మారడంతో, వినియోగదారుని గుండె గుభేల్‌మంటోంది.

గతేడాది వర్షాలు తక్కువ కావడంతో ఈ వేసవిలో ఎండలు మండుతున్నట్లు వాతావరణశాఖ నిపుణులు చెప్తున్నారు. ఈ ఏడాదిలో వేసవి ప్రారంభం కాక ముందే ఫిబ్రవరి నుంచి మొదలైన ఎండలు, వేడి... మేలో మరింత పెరగడం ఆందోళనకు గురిచేస్తోంది. దీర్ఘకాలిక రోగులు, వృద్ధులు ఎండ తీవ్రత, ఉక్కపోతకు విలవిల్లాడిపోతున్నారు. ఎసిలో ఉండే సంపన్నులు మినహా పేద, మధ్యతరగతి ప్రజలు అటు బయటకు రాలేక, ఇటు ఇళ్లలో ఉండలేక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వీటన్నింటినీ తట్టుకోవడానికి విద్యుత్ పరికరాలను ఆశ్రయిస్తే కరెంటు బిల్లు బాదేస్తోంది. అలా ఇలా కాదు ఏకంగా సాధారణ బిల్లు కంటే రెండింతలు దాటి రావడాన్ని చూసి సామాన్యుడు భయపడుతున్నారు.

చల్లని గాలినిచ్చే కూలర్లు, ఫ్యాన్లు, ఎయిర్ కండీషనర్ (ఎసి)ల వాడకమే కాదు.. వాటి వ్యాపారం కూడా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్థిల్లుతోంది. సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా కూలర్లు, ఫ్యాన్లనే ఎంపిక చేసుకుంటున్నారు. ఈ క్రమంలో పట్టణంలో కూలర్లకు డిమాండ్ ఏర్పడింది. ఈ డిమాండ్‌ను వ్యాపారులు బాగా క్యాష్ కూడా చేసుకుంటున్నారు. కూలర్ కనిష్టంగా రూ.8 వేల నుంచి రూ.18 వేల వరకు అమ్ముతున్నారు. సాధారణ రోజులతో పోలిస్తే, వీటి ధరలు కొంత పెరిగాయని వినియోగదారులు చెప్తున్నారు. ఇక స్టాండింగ్ ఫ్యాన్ కూడా రూ.రెండు వేల నుంచి రూ.ఐదు వేల వరకు విక్రయిస్తున్నారు. ఎసిల విషయానికి వస్తే దాని సామర్థ్యం, స్టేజ్, కంపెనీని బట్టి రూ.35 వేల నుంచి రూ.60 వేల వరకు పలుకుతున్నాయి. పుష్కలంగా వర్షాలు కురిసి వాతావరణంలో మార్పు వచ్చే వరకు ఇదే పరిస్థితి ఉంటుందని అంచనా.



ఎస్‌పిని అభినందిస్తున్న లయన్స్ సభ్యులు

ఎస్‌పికి లయన్స్ ప్రతినిధుల అభినందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటు వేయడానికి తోడ్పాటు అందించి ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా తీసుకున్న రక్షణ చర్యలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని లయన్స్ క్లబ్ సెంట్రల్ ప్రతినిధులు నటుకుల మోహన్, అధ్యక్షులు పొన్నాడ రవికుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా ఎస్‌పి జిఆర్ రాధికను ఆమె ఛాంబర్‌లో కలిసి మెమోంటో ఇచ్చి సత్కరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడమే కాకుండా ఓట్లశాతం పెరగడానికి పోలీసులు సహకరించారన్నారు. రేయింబవళ్లు శ్రమించిన పోలీసు యంత్రాంగాన్ని వారు అభినందించారు. ఎస్‌పిని కలిసిన వారిలో బి.దేవభూషణరావు, బి.సురేష్, పైడి సింధూర తదితరులున్నారు.



నగదు అందజేస్తున్న హెచ్‌ఎం కృష్ణారావు

రాజమండ్రి డిఇఒ ఔదార్యం

ప్రజాశక్తి- నందిగాం

రాజమండ్రి జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు తన ఔదార్యాన్ని చాటుకున్నారు. గతంలో టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారిగా విధులు నిర్వర్తించిన సమయంలో మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో చదువుతున్న విద్యార్థి బాలక శ్రీరాంచరణ్‌ని దత్తత తీసుకున్నారు. విద్యార్థులు ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించారు. దీంతో ఆ విద్యార్థి ఉన్నత చదువుల నిమిత్తం రూ.5 వేలు నగదుని పారితోషికంగా ప్రకటించారు. ఈ మేరకు ఆ నగదుని పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు, వాసుదేవరావు తరుపున ప్రతినిది కుప్పిలి ప్రకాష్‌లు దిమిలాడకు శ్రీరాంచరణ్‌కి గురువారం నగదు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బాలక రామారావు, దుంపా శ్రీనివాస్ పాల్గొన్నారు. వాసుదేవరావు ఔదార్యాన్ని లఖిదాసుపురం, దిమిలాడ సర్పంచ్‌లు బోంగి మోహనరావు, బొంగి హనుమంతరావు, తల్లిదండ్రులు బాలక రమణయ్య, సంతోషిలు అభినందించారు.



భూసార పరీక్షలు నిర్వహిస్తున్న రెడ్డీస్ ప్రతినిధులు

పోషకాలపై రైతులకు అవగాహన అవసరం

ప్రజాశక్తి- బూర్జ

రైతులు భూమిలో లభ్యమయ్యే పోషకాలపై అవగాహన కలిగి ఉండడం ఎంతైనా అవసరమని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు తెలిపారు. గురువారం మండలంలోని రామన్నపేటకు చెందిన పనస తవిటినాయుడు పొలంలో భూసార పరీక్షలు చేపట్టారు. భూముల్లో భూసార పరీక్షలు చేపట్టడం వలన ఏ భూమిలో ఏ పంటవేస్తే మంచి దిగుబడులు వస్తాయో తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. అధిక దిగుబడులను సాధించవచ్చునన్నారు. కాల్చడం వలన నేలకు అవసరమైన సూక్ష్మజీవులు చనిపోయి నేల సార్వతాన్ని కోల్పోవడమే కాకుండా కాలుష్యానికి గురవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త డిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



హాల్ టిక్కెట్లను చూపిస్తున్న కళాశాలల యజమానులు

జంబ్లింగ్ విధానం పాటించాలి

నరసన్నపేట: ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షా కేంద్రాల ఏర్పాటులో జంబ్లింగ్ విధానం తప్పనిసరిగా పాటించాలని ప్రయివేటు జూనియర్ కళాశాలల యాజమానులు కోరారు. ఈ మేరకు స్థానిక జ్ఞానజ్యోతి జూనియర్ కళాశాలలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, సంపత్ సాయి జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలుగా కేటాయించారని అన్నారు. సంపత్ సాయి కళాశాలలో ఆ కళాశాల విద్యార్థులు, ఆ కళాశాల అధ్యాపకులనే వేయడం సరికాదన్నారు. ఈ కేటాయింపు జంబ్లింగ్ విధానానికి విరుద్ధమన్నారు. అలాగే ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కేవలం సంపత్ సాయి జూనియర్ కళాశాలే పరీక్షా కేంద్రం కేటాయించి ఆ విద్యార్థులు పరీక్షలు రాయడం ఎంతవరకు సమంజసమని ప్రశినంచారు. ఈ విధంగా సెల్ఫ్ సెంటర్ ఇచ్చి ఆ కళాశాల విద్యార్థులు, సిబ్బందికి వేస్తే ఇతర కళాశాల విద్యార్థులకు, తెలివైన విద్యార్థులు నష్టపోతారని అన్నారు. అందుకు పరీక్షా కేంద్రాలు ఏర్పాటులో కలెక్టర్ జోక్యం చేసుకుని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జ్ఞానజ్యోతి నుంచి రంగారావు, శాంతి నుంచి చిన్నబాబు, పద్మావతి నుంచి ముసలినాయుడు, ఎంఎల్ఆర్ నుంచి జగదీశ్వరరావు పాల్గొన్నారు.



పోతయ్యను అభినందిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

ప్రాణాలు కాపాడిన కార్పెంటర్

శ్రీకాకుళం అర్బన్: జెమ్స్ ఆస్పత్రిలో ప్రసవానికి చేరి చికిత్స పొందుతున్న పి.కన్యాకుమారి కడుపులో ఉన్న బేబీ ఉమ్మనీరు తాగడం వలన 'ఎ' నెగెటివ్ రక్తం అవసరమైంది. ఎ నెగిటివ్ రక్తం అసాధారణమైనది కావడం వలన ఆకుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అరుదైన ఈ రక్తం కోసం బ్లడ్‌బ్యాంక్‌ల్లో సంప్రదించగా ఎమర్జెన్సీ బ్లడ్‌సర్వీస్ నంది ఉమా శంకర్ ధర్మవరం గ్రామానికి చెందిన కార్పెంటర్ పోతయ్య రక్తం ఎ నెగిటివ్ అని తెలుసుకుని సంప్రదించాడు. అడిగిన వెంటనే ఆయన స్పందిస్తూ రక్తదానం చేయడం వలన ఆమె ప్రాణాలు దక్కాయి. ఈ సందర్భంగా పోతయ్యను రెడ్‌క్రాస్ సభ్యులు అభినందించారు.

ఆదాయం ఫుల్... సౌకర్యాలు నిల్

- నేల మీదే దుకాణాలు
- మౌలిక సదుపాయాలు కరువై వ్యాపారుల గగ్గోలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



సంతలో నేలపై ఏర్పాటు చేసిన దుకాణాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలోని ఏడో వార్డు చింతాడ సంతలో సౌకర్యాలు లేక వ్యాపారులు, రైతులు, ప్రజలు నానా ఇబ్బందు లకు గురవు తున్నారు. ప్రతి శనివారం ఈ సంతలో లక్షల రూపాయల వ్యాపారం జరుగుతూ ఉంటుంది. అలాగే పురపాలక సంఘానికి ఈ సంత ద్వారా ప్రతి ఏటా అధిక ఆదాయం వస్తున్నప్పటికీ సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు ప్రజల నుంచి బహిరంగంగా వినిపిస్తున్నాయి. ప్రతిఏటా మార్చిలో పురపాలక సంఘం ఈ సంతకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తూ ఉంటుంది. అయితే గడిచిన రెండేళ్లుగా సంత వేలంపాటలో ఎవరు పాల్గొనకపోవడంతో పురపాలక సంఘం, రెవెన్యూ అధికారులు, చింతాడ సచివాలయం అధికారులు కలిసి సంయుక్తంగా సంత ఆశీలు వసూలు చేస్తున్నారు. 2021 - 22 సంవత్సరానికి సుమారు రూ.8 లక్షల వరకు చింతాడ గ్రామానికి చెందిన వ్యక్తులే సంత ఆశీల పాటను కైవసం చేసుకున్నారు. ఆ తరువాత ప్రభుత్వం ప్రతి ఏటా ఆశీల పాటను కొంత మొత్తంలో పెంపుదల చేయడంతో పాటలో పాల్గొనడానికి ఎవరు ముందుకు రాలేదు. దీంతో పురపాలక సంఘ సచివాలయ సిబ్బంది ఆశీలను వసూలు చేస్తున్నారు. జిల్లాలోని పలు మండలాల నుంచి గ్రామీణ ప్రాంత ప్రజలు, రైతులు శనివారం నిర్వహించే చింతాడ సంతకు వచ్చి వారికి కావాల్సిన వస్తువులను కొనుక్కొని వెళ్తుంటారు. అయితే ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు మున్సిపల్ అధికారులు కల్పించడం లేదని పలువురు వాపోతున్నారు. వేసవికాలంలో ఎండకు ఎండి వర్షాకాలంలో వానకు తడిసి వ్యాపారాలు కొనసాగిస్తున్నామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక మొత్తంలో ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నప్పటికీ తమకు కనీస స్థాయిలో కూడా సౌకర్యాలు కల్పించడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. ప్రతిఏటా మున్సిపాలిటీ పన్నులు పెంచుకుంటూ ఆర్థికంగా ఆదాయాన్ని సమకూర్చు కుంటుందని, వ్యాపారులకు, సంతకు వచ్చే ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో అటు ప్రభుత్వం ఇటు అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదని ఇప్పటికైనా నిద్రమత్తు విడనాడాలని పలువురు కోరుతున్నారు. సంతకు వచ్చే ప్రజలు, మూగజీవాలు ఎండ, వాన వంటి ప్రకృతి వైపరీత్యాలకు బలి కావాల్సిందేనని తమ ఆవేదనను వ్యక్త పరుస్తున్నారు. సంతలో షెడ్లు, ఫ్లోరింగ్ తదితర సదుపాయాలను కల్పించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ వాటి పరిష్కారానికి నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని పలువురు వాపోతున్నారు. సంతకు వస్తువులను కొనుగోలు చేయడానికి వచ్చే మహిళలు, వృద్ధులు కాలకృత్యాలు తీర్చుకోవాలంటే పొలాలు, ముళ్ల పొదల చాటుకు వెళ్లాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. కనీసం తాగేందుకు మంచినీరు లేక పలు వురు ఇక్కట్ల పాలవుతున్నారు. సంతలో కొన్ని సంవత్సరాల క్రితం ఏర్పాటుచేసిన బోరు మాత్రమే ఉంది. ఆ నీరు తాగేందుకు పనికిరావని పలువురు చెబుతున్నారు. నేలపై దుకాణాలు ఏర్పాటు చేయడంతో వర్షాకాలంలో సరుకులు తడిచి ఇబ్బందుల పాలవుతుంటామని పలువురు వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. సంతకు వచ్చే రైతులు, ప్రజలు కూడా వర్షంలో తడవకుండా చెట్ల కిందకు పరిగెట్టాల్సిందేనని పలువురు చెబుతుండడం విశేషం. పాలకులు, అధికారులకు ఆదాయమే కావాలని, ప్రజల సమ స్యలు వారికి పట్టవని పలువురు వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు సంతపై దృష్టి పెట్టి కనీస సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

స్వచ్ఛ భారత్ నిధులతో మరుగుదొడ్లు

2019 సంవత్సరం తరువాత పురపాలక సంఘంలో కొలువుదీరిన టిడిపి పాలకవర్గం స్వచ్ఛభారత్ పథకం కింద రూ.5 లక్షల నిధులతో మరుగుదొడ్లను అట్టహాసంగా సంతలో నిర్మించారు. మరుగుదొడ్లు నిర్మించడంతో కొంతమేర ఇబ్బందులు తొలగాయన్న రైతులు, ప్రజలు ఆశలు ఎంతో కాలం నిలవలేదు. వాటి నిర్వహణ బాధ్యతలు సక్రమంగా నిర్వహించకపోవడంతో శిథిలమై మూలకు చేరాయి. మరుగుదొడ్ల తలుపులు తదితర సామాగ్రి నాసిరకంగా ఉండడం, సరైన పర్యవేక్షణ లేకపోవడంతో మూన్నాళ్లకే మూలకు చేరాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



మూలకు చేరిన మరుగుదొడ్డు

సాయిమందిరంలో అన్నదానం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని విశాఖ బి కాలనీలో ఉన్న షిర్డీ సాయి మందిరంలో బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నారాయణ సేవా సమితి సభ్యుల ఆధ్వర్యాన గురువారం ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ట్రస్టుచైర్మన్ డాక్టర్ కమల్, కొంక్యాన ట్రస్టు సభ్యులు కొంక్యాన మురళీధర్, నారాయణరావు, సభ్యులు పాల్గొన్నారు.



వంజంగిలో సమావేశం నిర్వహిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

అర్హులందరికీ 'ఆసరా' జమ

ఆమదాలవలస: ప్రభుత్వం మహిళా సంఘాలకు ఇచ్చిన మాటకు కట్టుబడి అమలు చేసిన వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా అర్హులందరి ఖాతాలకు నాల్గవ విడత నిధులు జమకావడంతో గ్రామీణ ప్రాంతంలో అతివలు ఆనందోత్స వాలు వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 934 సంఘాల్లో 9354 మంది సభ్యులకు నాల్గవ విడతలో రూ.26 కోట్ల 72 లక్షల నిధులు అర్హత గల సంఘాల ఖాతాలకు జమయ్యాయి. గురువారం వంజంగి గ్రామ సంఘంలో మహిళలు సమావేశం నిర్వహించుకొని తమ సంఘాలకు జమైన నిధులను వ్యక్తిగత ఖాతాలకు సంఘం తీర్మానం ద్వారా బదిలీ చేయించుకొని సభ్యురాల వారీ అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామసంఘం ప్రతినిధులతో పాటు విఒఎ శ్రీదేవి పాల్గొన్నారు.



కచేరి నిర్వహిస్తున్న కళాకారులు

అన్నమాచార్య జయంతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తాళ్లపాక అన్నమాచార్య 616వ జయంతి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శ్రీ తరణి కృష్ణ స్మారక ధార్మిక సేవా ట్రస్ట్, శృతిలయ సంగీత శిక్షణాలయం సంయుక్తంగా నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మండ శ్రీనివాసరావు, ట్రస్టీలు వెంకట రమణమూర్తి, గణేశ్వరరావు, రెడ్డి సత్యనారాయణ, దొర జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ సంగీత సంస్థలకు చెందిన కళాకారులు అన్నమాచార్య కీర్తనలు గానం చేసి ప్రేక్షకులను అలరించారు. వీరికి హార్మోనియం రెడ్డి సత్యనారాయణ, వాయులీనం ధనుంజ య రెడ్డి, మృదంగం శ్రీనివాసరావు, వినోద్, సాయి చరణ్‌లు అందించారు. టి.కొండలరావు, శాక్సఫోన్ వాయిద్యంతో నాద నీరాజనం కార్యక్రమం నిర్వహించారు. జి.పవన్ కుమార్, వెంకటేశ్వరి, శ్రీచరణ్ పాల్గొన్నారు.

వివాదాల జోలికి వెళ్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రశాంతంగా ఉన్న పట్టణంలో రాజకీయ దురుద్దేశాలతో వివాదాలు సృష్టించే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కె.వెంకటేష్ హెచ్చరించారు. గురువారం పురపాలక సంఘంలోని 14వ వార్డు ఐజె నాయుడు కాలనీలో పోలీస్ సిబ్బందితో కలిసి కార్డాన్ సెర్చ్, ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో సోదాలు నిర్వహించగా ఎటువంటి పత్రాలు లేని మూడు ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటిని సీజ్ చేశారు. అనంతరం ఎస్ఐ వెంకటేష్ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన చిన్నపాటి మనస్పర్ధలను మరచిపోయి ఎప్పటిలా కాలనీలో ఉన్న కుటుంబాలన్ని ఐకమత్యంగా ఉండాలని తెలిపారు. కొంతమంది కావాలనే రాజకీయ లబ్ధికోసం శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నారని అటువంటి వారిని గుర్తించి కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ- 2 నాగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు



పట్టుబడిన ద్విచక్ర వాహనాలతో ఎస్ఐ వెంకటేష్

కొనసాగుతున్న వికలాంగ విద్యార్థుల గుర్తింపు



ఆమదాలవలస : సర్వే నిర్వహిస్తున్న విద్యాశాఖ సిబ్బంది

ప్రజాశక్తి- కవిటి

సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా చేపడుతున్న జీరో నుంచి 18 సంవత్సరాల వయసు గల వికలాంగుల అవసరాలు గల పిల్లల సర్వే మండలంలో కొనసాగుతోంది. అందులో భాగంగా సహిత విద్య ఉపాధ్యాయులు కృష్ణారావు, అరుణ్‌కుమార్ మండలంలోను కళింగపట్నం, కుసుంపురం, చిన్నబల్లిపుట్టుగ, మునిపుట్టుగ, దూగానపుట్టుగ తదితర గ్రామాల్లో గురువారం సర్వే నిర్వహించారు. ఇప్పటివరకు 18 మంది పిల్లలను గుర్తించినట్లు తెలిపారు.

నందిగాం : స్థానిక మండల రిసోర్స్ కేంద్రంలో ఐఇడి ఉపాధ్యాయిలు పి.రాణి, రామారావులు, విద్య వెల్ఫేర్ అసిస్టెంట్ నిరంజన్‌లు వికలాంగ విద్యార్థులను గుర్తించారు.

ఆమదాలవలస: సరుబుజ్జిలి మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న దివ్యాంగ పిల్లలపై స్పెషల్ డ్రైవ్ సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ- 2 కె.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన మండల కేంద్రమైన సరుబుజ్జిలిలో విద్యాశాఖ సిబ్బందితో కలిసి ఈ సర్వే నిర్వహించారు. సరుబుజ్జిలికి చెందిన పేకాన రాజేష్ బుద్ధిమాన్యం, వికలాంగ విద్యార్థిని గుర్తించడం జరిగిందన్నారు. ఈ సర్వేలో సచివాలయ సంక్షేమ విద్యా సహాయకులు సాయిరాం, ఐఇడి టీచర్లు ఎస్.ఢిల్లీశ్వరరావు, కె.అలేఖ్య, సిఆర్ఎంటి బెండి చిన్నారావు పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గౌతమ బుద్ధుని 2568వ జయంతి వేడుకలు గురువారం బుద్ధిస్ట్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా కమిటీ ఆధ్వర్యాన నగరంలోని ఇల్లీసుపురంలో అంబేద్కర్ విజ్ఞాన మందిర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు బోయిడి మురళీ కృష్ణ హాజరై మాట్లాడారు. ప్రజ్ఞ, శీల, కరుణ అష్టాంగ మార్గాన్ని ప్రభోదించే మహాత్ముడు గౌతమ బుద్ధుడని కొనియాడారు. ఆయన మార్గాన్ని ఎంచుకుని అంబేద్కర్ భౌద్ధ మతాన్ని ప్రజల్లో తీసుకెళ్లారని గుర్తు చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మైనార్టీ మత, కులస్తులపైన దాడులు రోజురోజుకీ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమానత్వం, రాజ్యాంగం హక్కులను కాలరాసే పరిస్థితి దాపురించిందన్నారు. కార్యక్రమానికి బి.ఎస్.ఐ జిల్లా అధ్యక్షులు కృష్ణారావు అధ్యక్షత వహించారు. బెందాళం కృష్ణారావు, డాక్టర్ రామారావు, కంఠ వేణు, లాస సోమేశ్వరరావు, చల్ల రామారావు, వాడాన కృష్ణారావు, చల్లా రామారావు, బొత్స బుద్ధుడు, రామప్పడు, భూపతి, చలపతి, దండాసి రాంబాబు (జాన్) తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు : జ్ఞాపికను అందజేస్తున్న హెచ్‌ఎం కృష్ణారావు

కొత్తూరు : మండలంలోని పొన్నుటూరు ప్రాథమికోన్నత పాఠశాలలో రామరాజు ఛారిటబుల్ ఆధ్వర్యాన బుద్ధిని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు, ఉపాధ్యాయులు అభినందించారు.సర్పంచ్ ఎద్దు చామంతి, సంతోష్‌కుమార్, వి.శేఖర్, కృష్ణారావు, అప్పన్న, త్రినాథ్‌లు పాల్గొన్నారు.

సాయం కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని జెండాల వీధికి చెందిన సుహాసిని పేదరికంలో కూలీగా జీవనం సాగిస్తోంది. భర్త లేక ఒంటరి మహిళగా జీవిస్తున్న ఆమెకు యశోద అనేకుమార్తె ఉంది. ఆమె ఇంటర్ వరకు చదువుకుంది. అనుకోని విధంగా ఆమెకు టిబి సోకడంతో అనారోగ్య కారణాలతో చదువును మధ్యలోనే ఆపేసింది. ఇటీవల ఆమెకు తీవ్ర అస్వస్థత కావడంతో రిమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. యశోదకు ఖరీదైన మందులతో పాటు పౌష్టికాహారం అవసరమవుతోంది. ఇప్పటికే రెడ్‌క్రాస్ ద్వారా పౌష్టికాహారం కిట్టును అందించారు. అలాగే యశోదమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మాధారపు డేవిడ్, సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి శిల్లా రమేష్, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు మేనేజర్ డా. టి.మణికంఠరావు, జిల్ ఫౌండేషన్ జాడ సాయి, మథర్స్ లవ్ ఫౌండేషన్ సుప్రజా రౌతు, లైన్స్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ కొంతం సునీల్ వారికి కొంత ఆర్థికసాయాన్ని అందించారు. కుమార్తె మంచానపడి ఆస్పత్రిలో చేర్చడం వలన తల్లి సుహాసిని కూలి పనులకు వెళ్లలేక ఆమె వద్దే ఉండాల్సి వస్తోంది. దీంతో ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని, ఆమెకు అవసరమైన ఆక్సిజన్ కాంసంట్రేసన్ ఇచ్చి ఆమెకు అండగా నిలవాలని సామాజిక సేవకుడు శివతేజ, రిమ్స్ స్టాఫ్ నర్స్ గిరిజాల మహాలక్ష్మి, కోరారు. వీరు యశోదను గురువారం పరామర్శించారు.



బాధితురాలితో మాట్లాడుతున్న మహాలక్ష్మి

మూగజీవులు విలవిల

ప్రజాశక్తి- టెక్కలి

మండుతున్న ఎండల నేపథ్యంలో మూగజీవులు నీటికోసం విలవిలలాడుతున్నాయి. ఎన్నడులేని విధంగా ఈ ఏడాది వేసవికాలంలో తీవ్రమైన వేడి గాలులు, వేడిమి వాతావరణం ఉండడంతో గ్రామాల్లోని బావులు నీటి నిల్వలు ఉన్న ప్రదేశాలు, చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో ఎక్కడా నీటి నిల్వలు లేకపోవడంతో మూగజీవులు నీటికోసం ఆరాటపడుతున్నాయి. పాడి పంటలుగా ప్రసిద్ధి చెందిన గ్రామాల్లో పశువులు తాగేందుకు నీరూ దొరకని పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో పాడి రైతులు పశువుల దాహార్తిని తీర్చడానికి నానా యాతనలు పడుతున్నారు. మేత కోసం పశువులు మైదాన ప్రదేశాలకు వెళ్లినప్పుడు వాటి దాహార్తిని తీర్చడానికి రైతులు ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. యాదవులు మేకలు, గొర్రెలు కూడా నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. పశుసంవర్ధకశాఖ అధికారులు స్పందించి గ్రామాల్లో పశువులకు నీటి నిల్వల కోసం తొట్టెలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వేడిమి వాతావరణానికి వర్షాలు లేక, నీరు దొరకని పరిస్థితుల్లో పశువులకు నీటి ఇబ్బందులు లేకుండా సంబంధిత ఆధికారులు చర్యలు తీసుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.



చెట్టు నీడన సేద తీరుతున్న మేకలు

కొట్లాట కేసులో 28 మంది అరెస్టు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని గోకర్ణపల్లిలో ఈ నెల 13న ఎన్నికల సమయంలో జరిగిన కొట్లాటకు సంబంధించి 28 మందిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వై.రవికుమార్ తెలిపారు. గోకర్ణపల్లిలో జరిగిన కొట్లాటలో జీవరత్నం, భాస్కర్, యతేంద్ర, సూర్య నారాయణలకు తీవ్రగాయాలయ్యాయి. దీనిపై కేసు నమోదుచేసిన పోలీసులు బుధ, గురువారాల్లో 28 మందిని అరెస్టు చేసి శ్రీకాకుళం కోర్టుకు తరలించారు. కోర్టు రిమాండ్ విధించడంతో వారిని జైలుకు తరలించినట్లు తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు ఎస్ఇబి స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 14 మద్యం సీసాలను ఎస్ఇబి స్టేషన్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఇబి ఎఎస్‌పి డి.గంగాధరం ఆదేశాల మేరకు గురువారం జి.సిగడాం మండల పరిధి గదబపాలెం వద్ద ఎస్ఐ ఇ.రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది దాడిచేసి. గణపతిని అదుపులోకి తీసుకుని ఆయన వద్ద 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గ్రంథాలయంలో క్విజ్ పోటీలు

ప్రజాశక్తి- లావేరు

వేసవి శిక్షణా శిబిరాల్లో భాగంగా లావేరు శాఖా గ్రంథాలయంలో గురువారం రిసోర్స్ పర్సన్ కొమ్మాన దీపక్ ఆధ్వర్యంలో జనరల్ నాలెడ్జ్‌పై క్విజ్ పోటీని నిర్వహించారు. 52 మంది విద్యార్థులు హాజరుకాగా 32 మంది విద్యార్థులు క్విజ్‌లో పాల్గొన్నారు. అనంతరం ల్యాప్‌టాప్ కోసం విద్యార్థులకు వివరంగా తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకులానికి విద్యార్థుల ఎంపిక

ప్రజావక్తి- నందిగాం

మండలంలోని హర్షబాడకు చెందిన నందిగాం వందన, హన్సికశ్రీ, రాజోరాణి, శ్రావ్యశ్రీలు టెక్కలి మహాత్మ జ్యోతీరావు పూలే బిసి గురుకులంలో ఐదో తరగతిలో ప్రవేశానికి ఎంపికయ్యారని ప్రధానో పాధ్యాయులు రామారావు గురువారం తెలిపారు. వందన కైజోలలో నాలుగో తరగతి చదివింది. వందనకు జిల్లా వ్యాప్తంగా 36వ ర్యాంకు రావడంపై తల్లిదండ్రులు కృష్ణారావు, సోనియా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ర్యాంక్ రావడానికి కారణమైన ఉపాధ్యా యుడు పోలాకి రామారావుకి ధన్యవాదాలు తెలిపారు.

రేపు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని పెద్దపేట గ్రామంలో ఉన్న ఆర్ఫ్ స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఆర్ఫ్‌సంస్థ సంయుక్తంగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని యువత ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. రక్తదానం చేయడం వలన మరొకరికి ప్రాణదానం చేయడం జరుగు తుందన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పి.జగన్మోహన్ రావుతో పాటు వైద్యులు పాల్గొంటారని తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సరుబుజ్జిలి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 25న శనివారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎం.రత్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి కిల్లి రమాదేవి అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని ఆమె కోరారు. అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలన్నారు.

పరామర్శ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అవయువదానంతో సుశీల మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపారని తెలుగు మహిళ అధ్యక్షురాలు గొండు స్వాతిశంకర్ అన్నారు. నియోజకవర్గం పరిధిలోని గార మండలం వాడపాలెంకు చెందిన పప్పు గోవింద కుమార్తె పప్పు సుశీల ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని తెలుసుకుని వారింటికి వెళ్లి ఓదార్చారు. గార మండలం కళింగపట్నం పంచాయతీ లోని తాన్ సాహెబ్ పేటకు చెందిన చీపురు సురేష్ హటాన్మరణం పొందడం ఎంతో బాధాకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సురేష్ కుటుంబసభ్యులను ఆమె పరామర్శించారు. ఆమెతో పాటు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మందస: మండలంలోని బిడిమి, ఉగ్రానిపేట, అంబుగాం, బొడ్డులూరు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన టిడిపి నాయకుల కుటుంబాలను మాజీ మంత్రి గౌతు శివాజీ గురువారం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసు కున్నారు. ఆయనతో పాటు మృతుల కుటుంబ సభ్యులు లబ్బ నారాయణ, డొక్కరి దానయ్య, మడియా లక్ష్మమ్మ, బొడ్డ నీలకంఠం, బమ్మిడి కర్రయ్య,కొనారి తులసీరావు, జుత్తు అమ్మినాయుడు, దున్న పురుషోత్తం, జోటియా హరికృష్ణ, బొడ్డ తిరుపతి, బత్తిన కృష్ణారావు తదితరులు ఉన్నారు.

బాబూరావు జన్మదిన వేడుకలు

పలాస:టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు ఆయన స్వగృహంలో గురువారం జన్మదిన వేడుకలు నిర్వహించారు. బాబూరావు కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులు కార్యకర్తలు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు వజ్జ గంగా భవాని, వజ్జ అనూష, టిడిపి నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, టంకాల రవి శంకర్ గుప్తా, మల్లా శ్రీనివాస రావు, బి.నాగరాజు, దానేటి పద్మజీ, యవ్వరి మోహనరావు, శంకర్, కొరికాన శంకర్ పాల్గొన్నారు.

27న పంచాది కృష్ణమూర్తి వర్ధంతి

వజ్రపుకొత్తూరు: ఈ నెల 27న పంచాది కృష్ణమూర్తి వర్ధంతి సభ నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ వంకల మాధవరావు కోరారు. మండలంలోని మర్రిపాడు అమరవీరుల స్థూపం వద్ద కృష్ణమూర్తి 55వ వర్ధంతి సభ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఉదయం పది గంటలకు పలాసలో సూది కొండ ఏరియాలో న్యూ డెమొక్రసీ కార్యాలయం వద్ద స్మారక సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, పిడిఎస్యుయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిల వినోద్, ఎఐకెఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వంకల పాపయ్య, జిల్లాఅధ్యక్షులు భీమారావు, తాతారావు పాల్గొన్నారు.